

మన రైతులు మోసపోయారు!

అధికారుల అలసత్వం.. నాయకుల నిర్లక్ష్యం.. చిత్తూరు ఉమ్మడి జిల్లా రైతులపాలిట శాపంగా మారింది. జాతీయ రహదారుల విస్తరణ, నిర్మాణం కోసం భూములు కోల్పోయిన మన రైతులు దారుణంగా మోసపోయారు. పొరుగునే ఉన్న తమిళనాడులోని రైతులకు చెల్లించిన పరిహారానికీ, ఏపీలోని మన రైతులకు చెల్లించిన పరిహారానికీ.. నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంది. తమిళనాడు రైతులు ఒక మామిడి చెట్టుకి రూ.1.20లక్షల దాకా పరిహారం అందుకోగా, చిత్తూరు జిల్లా రైతులకు అదే చెట్టుకి రూ. 5వేల లోపే ముట్టజెప్పి చేతులు దులుపుకున్నారు. అయినా నాయకులు ఎవ్వరూ దీన్ని ప్రశ్నించలేదు. అధికారులూ ఈ వివక్షను గుర్తించి సరిదిద్దలేదు. ఏ సంఘాలూ రైతుల పక్షాన నిలబడి పోరాటాలకు దిగలేదు. రైతులే తమకు పరిహారం పెంచండి స్వాములూ అంటూ ఆర్బిట్రేషన్‌కు దరఖాస్తు చేసుకుని వేడుకుంటూనే ఉన్నారు ఏళ్లుగా. ఆ కథాకమామిషు ఏమిటో సవివరంగా చదవండి...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



- జాతీయ రహదారుల భూసేకరణ పరిహారంలో దారుణ వివక్ష
- తమిళనాడులో మామిడిచెట్టుకి 1.20 లక్షలు
- కిలోమీటరు దూరంలోని మన జిల్లాలో రూ.5వేల లోపే



ఈ రైతు పేరు మురళి. చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలం జీఎంఆర్‌పురం ఇతని ఊరు. చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి కోసం ఇతను కోల్పోయిన భూమిలో పదేళ్ల వయసున్న 250 మామిడి చెట్లు ఉన్నాయి. ఈయనకు ఒక్కో చెట్టుకి రూ.4500 వంతున నష్టపరిహారం చెల్లించారు. సరిగ్గా ఈయన భూములు కోల్పోయిన తావుకి మూడు కిలోమీటర్ల సమీపంలోని తిరుమలరాజుకుప్పం గ్రామంలోనూ ఇదే జాతీయ రహదారి కోసం సుధాకర్‌నాయుడు అనే రైతు కూడా భూములు కోల్పోయారు. ఎనిమిదేళ్ల వయసున్న 100 మామిడి చెట్లను ఆయన కోల్పోయారు. ఈయనకు పరిహారంగా ఒక్కో మామిడి చెట్టుకి చెల్లించినది ఎంతో తెలుసా? అక్షరాలా రూ.1.20లక్షలు. ఇద్దరు రైతులూ భూములు కోల్పోయింది చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి కోసమే. మరి ఈ తేడా ఎందుకంటారా? సుధాకర్‌నాయుడు భూమి ఉన్నది తమిళనాడు రాష్ట్రం పరిధిలో. అభాగ్యుడు మురళి భూమి ఉన్నది ఆంధ్రప్రదేశ్‌లో. ఏపీలో భూమి కలిగి ఉండడమే ఆ రైతు చేసుకున్న పాపం అన్నమాట. తమిళనాడు రైతుకు సమానంగా పరిహారం చెల్లించి ఉంటే ఆంధ్ర రైతుకి రూ.3కోట్లు అంది ఉండాలి. కానీ ఆయనకు విదిలించింది మాత్రం రూ. 11,25,000 మాత్రమే.


విజయపురం మండలంలో జరుగుతున్న చిత్తూరు- తచ్చూరు హైవే నిర్మాణ పనులు



ఇతని పేరు గిరిధర్‌నాయుడు. చిత్తూరు- తచ్చూరు హైవే నిర్మాణంలో భాగంగా నింద్ర మండలం ఒరూరుపేట గ్రామంలో 250 మామిడి చెట్లను కోల్పోయారు. అధికారులు తొలుత వంద చెట్లను లెక్కించి రూ.5300 చొప్పున చెల్లించారు. 'నా పొలంలో ఇంకా 150 చెట్లున్నాయి సార్లూ' అని అధికారుల కాళ్లావేళ్లా పడితే రెండో విడతలో రూ.4700 చొప్పున 150 చెట్లకు పరిహారం అందించారు.మొత్తంగా రూ. 12,35,000 అందుకున్న ఈ రైతుకు నిజానికి రావలసింది రూ. 3 కోట్లు. అంటే రూ. 2.87 కోట్లకు పైగా ఇతను నష్టపోయాడన్నమాట.

చిత్తూరు- తచ్చూరు ఆరువరుసల జాతీయ రహదారి

ప్రస్తుత స్థితి: నిర్మాణంలో ఉంది.
మొత్తం నిడివి: 126.55 కి.మీలు
తమిళనాడులో: 43.55 కి.మీలు
చిత్తూరు జిల్లాలో: 83 కి.మీలు
(చిత్తూరు, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, నగరి, నింద్ర, నాగలాపురం మండలాల మీదుగా)
చిత్తూరు జిల్లాలో సేకరించిన భూమి: 1400 ఎకరాలు.

ఏడాదిగా పోరాటం

ఇదే జాతీయ రహదారి కోసం తమిళనాడు పరిధిలోని పళ్లిపట్టు తాలూకా శానాకుప్పం గ్రామంలో సుబ్రమణ్యం నాయుడు అనే రైతు 8 ఏళ్ల వయసున్న 59 చెట్లను కోల్పోగా.. అతనికి చెట్టుకు రూ.60 వేల చొప్పున అక్కడి అధికారులు పరిహారం చెల్లించారు. ఇదే ప్రాంతంలో 15 ఏళ్లున్న చెట్లకు రూ. 1.20లక్షలు వంతున పరిహారం లెక్కకట్టి ఇచ్చారు. పరిహారం బాగా తక్కువగా ఇచ్చారని మన జిల్లాలోని రైతులు పెద్దఎత్తున అందోళనలు చేశారు. కలెక్టరేట్‌నూ ముట్టడించారు. ఆర్బిట్రేషన్ (న్యాయ పోరాటం)ను ఆశ్రయించారు. ఏడాదిగా 300 మంది రైతులు ఆర్బిట్రేషన్ ద్వారా న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నారు.

పరిహారం ఇలా నిర్ణయిస్తారు

జాతీయ రహదారుల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. ఇందుకు కేటాయించిన మొత్తం నిధుల్లో 30 శాతం వరకు భూసేకరణ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. జాతీయ రహదారి సాగే ప్రాంతంలోని జాయింట్ కలెక్టర్ భూసేకరణ అధికారిగా ఉంటారు. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న భూ విలువ ఆధారంగా సేకరించిన భూమికి 2.5 రెట్లు అధికంగా పరిహారాన్ని అందిస్తారు. పరిహారం సరిపోలేదని అనిపిస్తే, జిల్లాలోని మంత్రులు, ఎంపీలతో చర్చించి కలెక్టర్ విచక్షణతో పరిహారం పెంచొచ్చు. అంటే ఆయా ప్రాంతాల్లోని నాయకులు అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లాలి. అధిక పరిహారం కోసం ప్రయత్నించాలి. ప్రజలకు బాసటగా నిలబడాలి. దురదృష్టవశాత్తూ చిత్తూరు జిల్లా రైతులను నాయకులు ఎవ్వరూ పట్టించుకోలేదు.

చిత్తూరు - తిరుపతి హైవేలోనూ అన్యాయమే!


రైతు జీవరత్నం రెడ్డి

చిత్తూరు- తిరుపతి భూసేకరణలో కూడా చిత్తూరు జిల్లా రైతులకు తీవ్ర అన్యాయమే జరిగింది. పూతలపట్టు మండలం పాలకూరు గ్రామానికి చెందిన జీవరత్నంరెడ్డికి కిచ్చన్నగారిపల్లె వద్ద భూములున్నాయి. ఆరేళ్ల కిందట 12 ఎకరాల మామిడి తోపును, అందులోని టేకు చెట్లను, బోరును ఈ రహదారి కోసం ఆయన కోల్పోవాల్సి వచ్చింది. మామిడి చెట్టుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల మధ్యలో పరిహారం అందించారు. బోరుకు రూ.1.10 లక్ష ఇచ్చారు. టేకు చెట్లకు రూ.500 నుంచి రూ.వెయ్యి మధ్యలో ఇచ్చారు. ఇలా ఎకరాకు భూమితో కలిపి రూ.11 లక్షల పరిహారంతో సరిపెట్టారు. ఇదే తమిళనాడులో చెల్లించిన లెక్కల ప్రకారం అయితే జీవరత్నం రెడ్డి కోట్ల రూపాయల పరిహారం అందేది. ఏపీలో జీవరత్నం రెడ్డికి న్యాయం చేయమంటూ కోరేవారు ఎవరు? అందుకే అధిక పరిహారం కోసం ఈయన చిత్తూరు జాయింట్ కలెక్టర్ కోర్టులో న్యాయపోరాటం (ఆర్బిట్రేషన్) చేస్తున్నారు. ఆరేళ్ల కిందట ఈ రహదారిలో రైతులకు మార్కెట్ ధర కంటే తక్కువగా పరిహారం ఇచ్చారు. పూతలపట్టు మండలంలోని కిచ్చన్నగారిపల్లె వద్ద ఎకరా రూ.కోటి ఉండగా, అప్పట్లో రూ.11 లక్షలు ఇచ్చారు. పి.కొత్తకోట వద్ద ఎకరా రూ.1.50 కోటి ఉండగా, అప్పట్లో రూ.34 లక్షలను చెల్లించారు. మామిడి చెట్లకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు మాత్రమే చెల్లించారు. తమిళనాడులో చెల్లింపులతో పోల్చుకుంటే 4268 మంది మన రైతులు దగాకు గురయ్యారు.

చిత్తూరు- తిరుపతి ఆరువరుసల రహదారి

ప్రస్తుత స్థితి: పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి
మొత్తం నిడివి: 61 కి.మీలు
(యాదమరి, చిత్తూరు, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, పాకాల, చంద్రగిరి మండలాల మీదుగా)
సేకరించిన భూమి: 276.9 హెక్టార్లు
చెల్లించిన పరిహారం: రూ.268.56 కోట్లు
(పాకాల, చంద్రగిరి మండలాల్లో కోర్టు కేసుల కారణంగా 700 మీటర్ల నిర్మాణం, 32 మంది రైతులకు రూ.12.56 కోట్ల పరిహారం పెండింగులో ఉంది. ఈ రహదారి నాయుడుపేట దాకా రెండో దశ నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది.)




చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో మోసం

చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణలోనూ ఇదే తరహా దగాకు చిత్తూరు జిల్లా రైతులు గురయ్యారు. తమిళనాడు రాష్ట్రం కాట్పాడి తాలుకా మహిమండలం గ్రామంలోని 512, 615, 619, 629 సర్వే నెంబర్లలో ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల మధ్యలో చెల్లించారు. అలాగే మామిడి చెట్టుకు రూ.26,350 చొప్పున చెల్లించారు. ఈ మేరకు అక్కడి భూసేకరణ విభాగ స్పెషల్ తహసీల్దార్ మురుగన్ పరిహారాన్ని మంజూరు చేశారు. ఇదే ఎక్స్‌ప్రెస్ హైవేలో చిత్తూరు జిల్లా రైతులకు మాత్రం మామిడి చెట్లకు రూ.4వేల నుంచి రూ.5వేల దాకా మాత్రమే పరిహారాన్ని అందించారు.

చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే

ప్రస్తుత స్థితి: నిర్మాణంలో ఉంది.
మొత్తం నిడివి: 261 కి.మీలు
తమిళనాడులో: 93 కి.మీ.లు
కర్ణాటకలో: 77 కి.మీలు
చిత్తూరు జిల్లాలో: 91 కి.మీలు
(గుడిపాల, చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె,వి.కోట మండలాల మీదుగా)
చిత్తూరు జిల్లాలో సేకరించిన భూమి: 918.66 హెక్టార్లు
చెల్లించిన పరిహారం: రూ.315 కోట్లు


గుడిపాల సమీపంలో జరుగుతున్న చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు


వీసీ, రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ద్రావిడ వర్సిటీ బంద్!

- వేతనాల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన ఫలితం
- పీజీ పరీక్షల నిర్వహణ నిలిపివేత

కుప్పం, మార్చి 1: ద్రావిడ విశ్వవిద్యాలయం శుక్రవారం మూతపడింది. ఐదు నెలలుగా వేతనాలివ్వలేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బంద్‌కు దిగడమే దీనికి కారణం. విశ్వవిద్యాలయంలో 254 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ఐదు నెలలుగా వేతనాలు అందలేదు. అయితే ఇటీవల వర్సిటీకి రూ.7.82 కోట్ల అడిషినల్ గ్రాంట్ వచ్చింది. ఇందులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోసమని ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించినా ఫలితం లేకపోయింది. ఇదేమని అడిగితే ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేదని అధికారులు చల్లగా చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం బంద్‌కు గురువారమే పిలుపునిచ్చారు. అయినా పట్టించుకోని అధికారులు బంద్ నోటీసులు ఖాతరు చేయకుండా శుక్రవారం పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలను కొనసాగించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బంద్‌కు దిగారు. పీజీ పరీక్షలు జరుగుతున్న విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి ఆపించేసి, విద్యార్థులను బయటకు పంపేశారు. అధికారుల సమాచారంతో ఇద్దరు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను తీసుకుని వర్సిటీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అయితే అప్పటికే విద్యార్థులు పరీక్ష హాలునుంచి వెలుపలికి వచ్చేయడంతో పరీక్షలు రద్దయిపోయాయి.అనంతరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తిరిగి వర్సిటీ ప్రధాన గేటు వద్దకొచ్చి ధర్నాకు దిగారు. వీసీ, రిజిస్ట్రార్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ దశలో పోలీసులు జోక్యం చేసుకుని, వర్సిటీ వీసీ కె.మధుజ్యోతిని, రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డిని పిలిపించారు. వారొచ్చి ఆందోళనకారులకు సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. రిజిస్ట్రార్ విజయవాడ వెళ్లి, అనుమతి తెచ్చేందుకు ప్రయత్నిస్తారన్నారు.అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పద్దు కింద ఉన్న మొత్తాన్ని ఈనెల30వ తేదీదాకా వేరే ఖర్చులకు ఉపయోగించుకోబోమని హామీ ఇచ్చారు.సమస్యను తాత్కాలికంగా దాటవేయడానికి అధికారులు అబద్ధాలు చెబుతున్నారని, తమకు వేతనాలు వచ్చాకే సమ్మె విరమిస్తామని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు స్పష్టంచేశారు.ఐదు నెలలతోపాటు అంతకుముందు సమ్మె కాలమైన రెండు నెలలకు కలిపి ఏడు నెలలకు వేతనాలు చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. ఎంత చెప్పినా వినకపోవడంతో అధికారులు మౌనంగా వర్సిటీలోకి వెళ్లిపోయారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన కొనసాగించారు.

ఉద్యోగుల ఆకలి కేకలు వినబడలేదా?

- జగన్‌కు ఎమ్మెల్సీ కంచర్ల ప్రశ్న

ద్రావిడ వర్సిటీలో వేతనాల కోసం ఉద్యోగులు పెడుతున్న ఆకలి కేకలు వినబడలేదా అని సీఎం జగన్‌ను టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రశ్నించారు. 250 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కుటుంబాలతోసహా పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'పాలారు' తుట్టెను కదిపిన జగన్


పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం ఇదే (ఫైల్ ఫొటో)

- భగ్గుమన్న 'తమిళనాడు'
- తిరుపత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన రైతులు

కుప్పం, మార్చి 1: ఎన్ని విమర్శలు వచ్చినా, సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నా జగన్ సర్కారు దుందుడుకు చర్యలతో ఎన్నికల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకే వెళ్లింది. పాలారు ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేస్తూ విడుదల చేసిన జీవోను బహిరంగ పరచింది. దీంతో తమిళనాడు రాష్ట్రం భగ్గుమంది. ఆ రాష్ట్రంలోని తిరుపత్తూరు కలెక్టరేట్ ఎదుట రైతులు శుక్రవారం ధర్నాకు దిగారు. కర్ణాటకలో ప్రారంభమయ్యే పాలారు నది, ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడుకు ప్రవహిస్తుంది. ఇందులో వర్షాకాలమప్పుడే జలాలు కనిపిస్తాయి. అయితే ఈ సమయంలో నీటిని నిలువ ఉంచుకోవడానికి 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కుప్పం మండలం గణేశ్‌పురం వద్ద పాలారు నదిమీద రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన ఫలకం వేశారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టు గుమ్మం తొక్కింది. అంతర్రాష్ట్ర నది అయిన పాలారుపై ప్రాజెక్టు నిర్మించడం వల్ల దిగువ భాగాన ఉన్న తమ హక్కులకు భంగం కలుగుతుందని, రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని వాదించింది. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. ఇందువల్ల తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేయలేదు. అయితే ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో జరిగిన సభలో సీఎం జగన్ పాలారు ప్రాజెక్టు తుట్టెను కదిల్చారు. అదే గణేశ్‌పురం వద్ద రూ.214 కోట్ల వ్యయంతో 0.6 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు ప్రకటించారు. ఇది తమిళనాడులో కలకలం సృష్టించింది. ఆ ప్రభుత్వ నీటిపారుదల శాఖ మంత్రి దొరై మురుగన్ మరుసటి రోజైన 27వ తేదీన ఏపీ సీఎం ప్రకటనను ఖండిస్తూ ప్రతి ప్రకటన విడుదల చేశారు. 1892 నాటి మద్రాసు-మైసూరు ఒప్పందంలో పేర్కొన్న అంతర్రాష్ట్ర నదులలో ఒకటైన పాలారుపై ఏకపక్షంగా రిజర్వాయర్ నిర్మిస్తానని చేసిన ప్రకటనను గర్హించారు. ఈ ప్రాజెక్టుపై ఇలాగే వ్యవహరిస్తే ఆందోళనలకు సిద్ధమని తమిళనాడు రాష్ట్ర రైతులు హెచ్చరించారు.


తిరుపత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న తమిళ రైతులు

వైసీపీ అధినేతకు కావాల్సింది ఇదేనా?

కుప్పం ప్రజలపై వైసీపీ అధినేత ప్రేమతో నియోజకవర్గానికి సాగునీరు అందించడానికి కోట్ల రూపాయలతో పాలారు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలనుకుంటున్నారా? అంటే వాస్తవాలు తెలిసిన వారెవరూ అలా అనుకునే అవకాశం లేదని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఈ నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో ఏదో చేసేస్తున్నానన్న ఇమేజ్‌ను సొంతం చేసుకుని, కుప్పంలో ఓట్లను కొల్లగొట్టడానికే ఈ రాగాన్ని జగన్ అందుకున్నారని విమర్శిస్తున్నాయి. పైగా ప్రాజెక్టు ప్రకటనతో తమిళనాడును గిల్లి, ఆందోళనలు చెలరేగేలా చేయడమే ఆయన ప్రధాన ఉద్దేశమంటున్నాయి. ఇలా చేయడంవల్ల తాను మంచి చేయబోతే తమిళనాడు అడ్డుకుంటోందన్న సానుభూతి కూడగట్టడానికే జగన్ ఇటువంటి ప్లాన్ వేశారని ప్రతిపక్షాల ఉవాచ.

వైరల్ అయిన జీవో

తమిళనాడు రాష్ట్ర అభ్యంతరాన్ని, అక్కడి రైతుల ఆందోళనను ఏమాత్రం పట్టించుకోని ఏపీ సీఎం మాత్రం పరిపాలనా అనుమతులు ఇచ్చిన జీవోను ప్రభుత్వం ద్వారా శుక్రవారం బహిరంగ పరిచారు. ఈ జీవో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మొత్తం రూ.214,81,00,000తో గణేశ్‌పురం వద్ద పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇస్తున్న జీవోలో ఏ పనికి ఎంతెంత నిధులు కేటాయిస్తున్నది కూడా స్పష్టంగా పేర్కొన్నారు. ఒకటో దశలో సర్వేయింగ్, ఇన్వెస్టిగేషన్స్, డీపీఆర్ తయారీకి రూ.0.432 లక్షలు, భూ సేకరణకు రూ.4.878 కోట్లు, కేటాయించారు. అలాగే రెండో దశ పనులకు రూ.166.500 కోట్లు కేటాయించారు. దీంతో తమిళనాడులోని తిరుపత్తూరు కలెక్టరేట్ ఎదుట రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. సుప్రీం కోర్టులో కేసు ఉంటే ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఇలాగే వ్యవహరిస్తే ఏపీకి వచ్చి మరీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వలంటీర్‌పై సైబర్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1: తిరుపతి ఈస్ట్ పోలీసులు చిత్తూరు జిల్లాకు చెందిన ఓ వలంటీర్‌పై సైబర్ కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌడేపల్లె మండలం బయ్యప్పల్లి గ్రామ వలంటీర్ జి.నాగేంద్రకు తిరుపతిలోని ఓ యువతికి పరిచయస్తుడు. ఆ యువతికి ఇటీవల పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో యువతి గురించి వరుడి సెల్‌ఫోన్‌కి అసభ్యంగా మెసేజ్ పెట్టాడు. దీనిపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో గురువారం ఈస్ట్ పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం నాగేంద్రను అరెస్ట్ చూపిస్తూ.. 41 నోటీసు జారీ చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజున 897 మంది గైర్హాజరు


చిత్తూరు ఆర్కే జూనియర్ కళాశాలలో..

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున ఇంటర్ ఫస్టియర్ తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, తమిళం లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. 17,036 విద్యార్థులకు గాను 16,139 మంది హాజరవగా, 897 మంది గైర్హాజరయ్యారు. డీవీఈవో, పరీక్షల కన్వీనర్ సయ్యద్ మౌల నాలుగు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. డీఎస్పీ రాజగోపాల్ రెండు సెంటర్లు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 10 సెంటర్లు, స్క్వాడ్ 11 సెంటర్లను పరిశీలించారు.

10న చిత్తూరులో నారా లోకేశ్ 'శంఖారావం'

చిత్తూరు సిటీ, మార్చి 1: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' సభ ఈనెల పదో తేదీన చిత్తూరులో నిర్వహించనున్నారు. తిరుపతి, జిల్లాల్లో మూడ్రోజులపాటు శంఖారావం సభలు జరగనున్నాయి. 9వ తేదీ మధ్యాహ్నం చంద్రగిరి, సాయంత్రం నగరిలో, 10న ఉదయం గంగాధరనెల్లూరు, మధ్యాహ్నం చిత్తూరులో, 11వ తేదీన ఉదయం పలమనేరు, మధ్యాహ్నం కుప్పం నియోజకవర్గాల్లో సభలుంటాయి.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు మార్చి1: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఊరి గంగమ్మ కుంభాభిషేక వేడుకలు



శాంతిపురం, మార్చి 1 : మండల పరిధిలోని కరేగానూరులో నూతనంగా వెలిసిన ఊరి గంగమాంబ కుంభాభిషేక వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం వేద పండితులచే హోమాలు నిర్వహించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. అలాగే గోపరంపైన కలశ స్థాపన చేపట్టారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులను గ్రామంలోని పూర్వ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారి వేడుకలకు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మూడు రోజులు పాటు జరిగిన కుంభాభిషేక వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బోయకొండలో ముగిసిన లక్ష కుంకుమార్చన



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ, కుంకుమార్చన చేస్తున్న భక్తులు

చౌడేపల్లె, మార్చి1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన శుక్రవారం వైభవంగా ముగిసింది. అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘమాసం సందర్భంగా కొండపై ఉన్న డార్మిటరీ హాల్‌లో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, కలశస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి వెండి ప్రతిమకు ఉభయదారులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గణపతి, ఆదిత్య, నవగ్రహ, చండీహోమాలు నిర్వహించారు. 165 జంటలు లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నాయి. ఆలయ చైర్మన్ నాగారాజరెడ్డి, ఈవో చంద్రమౌళి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జడ్పీ చైర్మన్ సమీక్ష

గంగవరం, మార్చి1: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధికారులతో సమీక్షించారు. శుక్రవారం గంగవరం మండల కార్యాలయానికి చేరుకున్న ఆయన ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్షించారు. వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుజాగ్రత్త వహించాలని సూచించారు. మేలుమాయి పంచాయతీ మర్రిమాకుపల్లెలో బోర్‌వెల్ కోసం మంజూరైన రూ.2.50 లక్షల ఉత్తర్వులను ప్రజాప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఏపీవో మురగేష్, సీసీ బాబు, చలపతి రెడ్డి, చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళులు



పుంగనూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు, మార్చి1: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు తీసుకున్న అమర వీరులకు ఘన నివాళులర్పిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అమరవీరుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. గత 30ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని, తమ హక్కులు సాధించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శంకర్, రెడ్డెప్ప, ప్రభాకర్, వెంకటరమణ, మురళిమహేశ్, చెంగల్రాయప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోమల : సోమల బస్టాండ్‌లో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో వర్గీకరణ పోరుబాటలో అసువులు బాసిన అమరవీరులకు వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ప్రభుకుమార్, ప్రకాశ్, మొగిలేశ్వర్, తోట లక్ష్మీపతి, రవి, శుభకర్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పుంగనూరు, మార్చి1: ఓటు హక్కును యువత సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపకుడు అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంసీవీ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఓటు కోసం రాజకీయ పార్టీలు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. ఓటుతో సమాజాన్ని మార్చడానికి అవకాశం ఉందన్నారు. ఓటు విలువ, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత యువత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు నాగరాజ, భద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

సదుం, మార్చి 1: చెరుకువారిపల్లెలోని పీహెచ్‌సీ వైద్యాధికారిణి గిరీషా ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంపై పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో చుక్కల కేంద్రాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 0-5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని, తల్లిదండ్రులు తప్పకుండా చిన్నారులకు చుక్కలు వేయించాలని ఆమె తెలిపారు. ప్రయాణంలో ఉన్న వారు కూడా స్థానిక బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన బూత్‌లో వారి చిన్నారులకు చుక్కలు వేయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ్ భాస్కర్, నీలకంఠ, శిఖామణి, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి దినేష్‌కుమార్ పేర్కొన్నారు.మండలంలో 21 పల్స్ పోలియో పాయింట్లు, రెండురూట్లు ఉంటాయన్నారు.

ఆర్బీకేలలో ఈ-పంట వివరాల ప్రదర్శన

సోమల, మార్చి 1: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆయా ఆర్బీకేలలోని నోటీసు బోర్డులలో ప్రచురించినట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఇరికిపెంట ఆర్బీకేలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో 1259 మంది రైతులు 2142 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశారన్నారు. రైతుల జాబితాలో ఎలాంటి పొరబాట్లు ఉన్నా ఈనెల 5లోపు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. సమావేశంలో ఏవో సుధాకర్, సర్పంచు రెడ్డెప్ప రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జింగ్ జోన్ ప్రారంభం

పలమనేరు/గంగవరం : పట్టణ సమీపంలో బైపాస్ రోడ్డుపక్కనే ఉన్న పారిశ్రామిక వాడలో శుక్రవారం వాహనాలకు విద్యుత్ ఛార్జింగ్ చేసే జోన్‌ను మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రారంభించారు. టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, ఆర్.వి. బాలాజి, నాగరాజు, గిరిబాబు, లోకేష్‌ఆచారి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ఆవుల పబ్బం

కిక్కిరిసిన కాటమరాజు ఆలయం - 14గ్రామాల్లో నెలకొన్న సంక్రాంతి సందడి



దీపాలు, దివ్వెలు తలపై మోసుకెళుతున్న మహిళలు, ప్రత్యేకాలంకరణలో చాందిని బండ్లు

చౌడేపల్లె, మార్చి1: మండలంలోని 14 గ్రామాల ప్రజలు కాటమరాజుకు శుక్రవారం దివ్వెలు, దీపాలు సమర్పణతో ఆవుల పబ్బం సంబరాలు ముగిశాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకునుంజార్లపల్లె, సింగిరిగుంట, నూనెముద్దలపల్లె, పేరావాండ్లపల్లె, పరికిదోన, దొనపల్లె, చిన్నకంపల్లె, మల్లెలవారిపల్లె, దిగువమల్లెలవారిపల్లె, సామిరెడ్డిపల్లె, మదుకూరు, మొరంకిందపల్లె, చౌడగానిపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాలలో పొలిమేరలలోని గ్రామదేవతలకు మంగళవాయిద్యాల నడుమ దివ్వెలు, దీపాలు సమర్పించారు. అనంతరం కంపల్లెకు చెందిన చాందిని బండిలో కాటమరాజు ఉత్సవమూర్తిని అధిష్ఠింపచేసి ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్స్‌తో గ్రామాలలో ఊరేగించారు. అలాగే దిగువమల్లెలవారిపల్లె, దొనపల్లె, పరికిదొన, పరికిదొన ఎస్సీ కాలనీ, పేరాపల్లె, నూనెముద్దలవారిపల్లె, కంపల్లె గ్రామాల నుంచి చాందిని బండ్లను విద్యుత్ దీపాలు, ప్రభలతో ప్రత్యేకంగా అలకంరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగిస్తూ దొనపల్లె వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి కోలాటలు నడుమ ప్రత్యేకంగా అలంకరించిన దేవరెద్దు వెంట 14 గ్రామాల మహిళలు దొనపల్లె అటవీ ప్రాంత సమీపంలో ఉన్న కాటమరాజు ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షణలు నిర్వహించి స్వామివారికి దివ్వెలు, దీపాలు సమర్పించారు. అనంతరం జంతు బలులు సమర్పించి మొక్కులు తీర్చుకుని బంధు మిత్రులతో కలిసి విందులు చేయడంతో ఆవుల పబ్బం వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆవుల పబ్బం వేడుకలలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఆయన ఆవుల పబ్బం సందర్భంగా సింగరిగుంట, పరికిదొన పంచాయతీలలో పర్యటించారు. ఆయనకు బోయకొండ ఆలయ కమిటీ మాజీ సభ్యుడు జంపాల శ్రీనివాసులునాయుడు కుటుంబీకులు స్వాగతం పలికారు.

జగన్‌వి మోసపూరిత మాటలు : అమర్



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి1 : గత ఎన్నికల సమయంలో జగన్ చెప్పిన మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు మున్సిపాలిటీ ఎల్‌బీ నగర్, రంగాపురం, ఎంఎస్‌ఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగాపురం క్రాస్‌లో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 2019 ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, తనను గెలిపిస్తే ధరలు తగ్గిస్తానని, విద్యుత్ ఛార్జీలు పెంచనని, పరిశ్రమలు తీసుకొస్తానని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, మద్యనిషేధం చేస్తానని తప్పుడు వాగ్దానాలు ఇచ్చాడన్నారు. జగన్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయి వైసీపీని గెలిపించారన్నారు. గెలిచిన తరువాత ఇప్పటి వరకు జాబ్‌క్యాలెండర్ ఊసేలేదన్నారు. విద్యుత్ ఛార్జీలు 9 సార్లు పెంచాడని, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచాడని, చివరకు చెత్తపై కూడా పన్నులు వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ పేరు తెచ్చుకొన్నాడని ఆరోపించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో మున్సిపాలిటీలో ఈద్గాకోసం రూ కోటి మంజూరు చేశానని, ఇప్పటికీ ఈద్గా నిర్మించలేదని మొండిగోడలు దర్శనమిస్తున్నాయని, ఎస్సీలకు అంబేడ్కర్ భవనం, బీసీలకు బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినా నేటి వరకు నిర్మించలేదన్నారు. కళామందిరం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా ఆ స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్సు నిర్మించి గదులు పంచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్వీ బాలాజి, ఆర్పీసీకుట్టి, మదన్‌మోహన్, ఖాజాపీర్, గిరిబాబు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని దించేందుకు ప్రజలు సిద్ధం : చల్లా బాబు



మహిళలకు పార్టీ కరపత్రాలు అందజేస్తున్న చల్లా బాబు

సోమల, మార్చి 1: వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లె, చిన్నకమ్మపల్లె, నాగిళ్లవారిపల్లె, వడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణం టీడీపీ ప్రభుత్వం 87 శాతం పనులు పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం 10శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ కేసుల నమోదులో రికార్డు సృష్టించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనతో కూడిన ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, సూరిశెట్టి నాగభూషణం, మండల మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, రవి నాయుడు, కొల్లా హరిప్రసాద్, పీఎం మల్లికార్జున, శివశంకర్, చంద్రశేఖర్‌నాయుడు, రఫీ, వినోద్ కుమార్, వేణుగోపాల్ నాయుడు, మహేంద్రబాబు, చాన్‌బాషా, పవన్, చంద్రశేఖర్, గుర్రప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో లక్ష లక్ష్యం సాధించాలి



కుప్పంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మార్చి 1: సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజారిటీ తేవాలని టీడీపీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కుప్పం టీడీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం శంఖారావం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కుప్పం మున్సిపల్, రూరల్, గుడుపల్లె మండలాలకు సంబంధించినవారు పాల్గొన్న ఈ సభలో పలువురు నాయకులు భావోద్వేగంతో ప్రసంగాలు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు, నియోజకవర్గ సమన్వయకర్త గాజుల ఖాదర్‌బాషా, చంద్రశేఖర్‌లు జగన్‌రెడ్డి దౌర్జన్యపూరిత పాలన తీరును ఎండగట్టారు. ప్రజలందరూ జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని, టీడీపీ వైపు చూస్తున్నారని చెప్పారు. దీనిని ఓట్లుగా మార్చుకోవడం ఒక్కటే టీడీపీ కేడర్ చేయాల్సిన పని అని పేర్కొన్నారు. అంతముందు కుప్పంలోని తిరుపతి గంగమాంబ ఆలయం, లక్ష్మీపురంలోని ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టారు. అలాగే కుప్పం పాతపేట బాబయ్య మఠం మసీదులో ముస్లింలతో కలిసి టీడీపీ నాయకులు ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో రాజ్‌కుమార్, వీజీ.ప్రతాప్, విష్ణు, టీడీపీ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ జనరల్ సెక్రటరీ చాంద్‌బాషా, గని, ఉమర్, ఉమ్మైర్, మునాఫ్, అలాబక్ష్, నవాబ్, ఇర్ఫాన్, షరీఫ్, ఫైరోజ్, అబ్దుల్ సుభాన్, మహబూబ్ పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమే



రామకుప్పంలో గ్రామవికాస సమావేశంలో పాల్గొన్న నేతలు

రామకుప్పం, మార్చి 1: రాష్ట్రంలో కొద్ది రోజుల్లోనే వైసీపీ రాక్షస ప్రభుత్వం అంతమై టీడీపీ-జనసేన కూటమి ఆధ్వర్యంలో రామరాజ్య స్థాపన జరుగుతుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి తెలిపారు. శుక్రవారం రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో జరిగిన గ్రామ వికాస సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకం, అవినీతి, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మరని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘనవిజయం సాధిస్తుందన్నారు. కుప్పంలో కూడా ప్రజలంతా టీడీపీకి అండగా నిలిచి చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలనాని వారు కోరారు. ఈ సమావేశంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, మహ్మద్‌రఫీ, నందారెడ్డి, గజేంద్ర, జయశంకర్, సలాంసాబ్, కృష్ణానాయక్, వెంకటరమణ, శ్రీరాములురెడ్డి, టీవీరవి, సతీష్, బాలరాజు, అవినాశ్, మంజునాథ్, కేశవరెడ్డి, అమర్, కామరాజనాయక్, సురేష్, పద్మమ్మ, అలివేలుమంగమ్మ, నరసింహులు, ఆదిల్, శంకర్, బొరుగులుశీన, రామలింగారెడ్డి, హనీఫ్, హీరా, హఫీజ్, అప్పా, సుబ్బయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి యువకుల చేరిక



కుప్పం, మార్చి 1: కుప్పం నియోజకవర్గ జనసేన పార్టీలోకి శుక్రవారం పలువురు యువకులు చేరారు. కుప్పం పురపాలక సంఘానికి చెందిన తబరేశ్, సంజయ్, నాగరాజు, శరవణ, అరుణ్‌లు జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ తెలిపారు. స్థానికక జనసేన కార్యాలయంలో వారిని ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ ప్రచారం ప్రారంభం



కుప్పం, మార్చి 1: కుప్పంలో భారతీయ జనతాపార్టీ 'ప్రజాపోరు' అనే పేరుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. కుప్పం పట్టణంలో ప్రచార రథాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.తులసీనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల అధ్యక్షులు ఇ.వడివేలు, టి.రామచంద్రుడు, బి.వెంకటేశ్, రాజసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా వాయిదా

కుప్పం, మార్చి 1: శాంతిపురం మండలం అబకలదొడ్డిలో మురుగేశ్‌కు చెందిన స్థల వివాదంలో ఆయనకు జరిగిన అన్యాయానికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ విషయమై వారు శుక్రవారం డీఎస్పీ శ్రీనాథ్‌తో చర్చలు జరిపారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో శుక్రవారం జరగాల్సిన ధర్నా వాయిదా వేస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజ్, రాజ్‌కుమార్, ప్రకాశ్, పాపన్న, గోవిందప్ప, ఉదయకుమార్, రవీంద్ర, మురుగేశ్, కిరణ్, రమేశ్, రంజిత్ పాల్గొన్నారు.

చౌడేపల్లె ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి



చౌడేపల్లె, మార్చి1: చౌడేపల్లె ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగవరంలో పనిచేస్తున్న తనను చౌడేపల్లెకు బదిలీ చేయటంతో తాను బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో శాంతి బద్రతలు కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, మార్చి1: ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. ఏతూరుకు చెందిన వెంకటరమణ భార్య లక్ష్మీదేవి(42) కుటుంబకలహాలతో మనస్థాపం చెంది పంటలకు తెచ్చిన పురుగుల మందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

శాంతిపురం, మార్చి 1 : తుమ్మిశి పంచాయతీ తొలసినాయనపల్లె వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కేవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేది లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ లేదా ఏపీఎంఎస్. ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నరు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

అడవినాథునికుంట ఆదర్శపాఠశాలలో...

పుంగనూరు రూరల్, మార్చి1: మండలంలోని అడవినాథునికుంట ఆదర్శపాఠశాలలో ఆరో తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. బీసీ, ఓబీసీలు ఫీజు రూ. 150, ఎస్సీ, ఎస్టీలు రూ. 75 చెల్లించాల్సివుందన్నారు. ఈ నెల 31తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేయాల్సివుందన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

రామకుప్పం, మార్చి 1: రామకుప్పంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని కళాశాల విద్యార్థులు పట్టణశివార్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు హాజరయ్యారు. శుక్రవారం 186 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 173మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ నీరజ తెలిపారు.

పుంగనూరులో...

పుంగనూరు రూరల్: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల కస్టోడియన్‌అధికారి రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మూడు కేంద్రాల్లో 937మంది పరీక్షలు రాయాల్సివుండగా 890మంది మాత్రమే హాజరైనట్లు ఆయన తెలిపారు.

సదుంలో 26 మంది గైర్హాజరు

సదుం : సదుంలో శుక్రవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 26 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల కేంద్రాల్లో జరిగిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలకు 254 మంది హాజరు కావాల్సి ఉండగా అందులో 26 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పులిచెర్లలో 15 మంది గైర్హాజరు

కల్లూరు : పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందనవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మొదటి రోజు నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 174 మంది హాజరుకావాల్సి ఉండగా 159 మంది హాజరయ్యారని తెలిపారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సోమలలో 17 మంది గైర్హాజర్

సోమల : సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలుగు పరీక్షకు 153 మంది హాజరు కావాల్సి ఉండగా 17మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు తెలిపారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పదోన్నతి కోసం ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు.

పంటల నమోదుపై సామాజిక తనిఖీలు

పుంగనూరు రూరల్, మార్చి1: ఈ-పంట నమోదుపై ఈనెల 2, 3 తేదీల్లో సామాజిక తనిఖీలు చేయనున్నట్లు ఏడీ శివకుమార్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలలోని 8 మండలాల పరిధిలో 19415 ఎకరాల్లో సాగైన పంటలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ-పంట నమోదు చేయించుకున్న రైతుల పేర్లు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో నోటీసు బోర్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 3వ తేదీలోపు ఫిర్యాదు చేయాల్సివుందన్నారు.

కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ కనిపించింది. పార్టీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. సాధిద్దాం సాధిద్దాం...ప్రత్యేక హోదా సాధిద్దాం నినాదాలతో తిరుపతి లోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక హోదా-న్యాయ సాధన సభ మార్మోగింది.కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ జెండాలు సభలో రెపరెపలాడాయి. పీసీసీ చీఫ్ షర్మిల ప్రసంగం పట్ల శ్రేణులు ఉత్సాహంగా కనిపించారు. 'మోదీ-కేడీ' అంటూ సభికులతో చెప్పించడం, జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయాడంటూ 'రేవు దాటేంత వరకే ఓడ మల్లన్న, రేవు దాటిన తర్వాత బోడి మల్లన్న' సామెతను పలుమార్లు ఉటంకించడం, 'ఢిల్లీలో జగనన్న పిల్లి' అంటూ మాట్లాడిన సమయంలో కార్యకర్తలు చప్పట్లతో మారుమోగించారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, పల్లంరాజు, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి,కనుమూరి బాపిరాజు,పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాంతియా కుమారి, ముఖ్య నాయకులు జేడీశీలం, మయ్యప్పన్, రాకేష్,సునీల,వేణుగోపాల రెడ్డి, మాగంటి గోపాల రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ప్రమీలమ్మ,చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాస రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రామానాయుడు, సీపీఎం నేత గఫూర్,ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు మణినాయుడు,నీరుగట్టు నగేష్, వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)



న్యాయ సాధన సభకు హాజరైన జనం మధ్య రెపరెపలాడుతున్న కాంగ్రెస్, వామపక్షాల పతాకాలు-వేదికపై కాంగ్రెస్ నాయకులతో సీపీఐ,సీపీఎం నేతలు నారాయణ, గఫూర్

కాంగ్రెస్‌లో నయా జోష్

ప్రత్యేక హోదా నినాదాలతో మార్మోగిన ఎస్వీయూ స్టేడియం

మునికోటి ఆత్మాహుతికి మోదీ సమాధానమేంటి?

ప్రత్యేక హోదా కోసం 2015లో కాంగ్రెస్ కార్యకర్త మునికోటి తిరుపతిలో ఆత్మాహుతి చేసుకున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ ఆ కుటుంబానికి ఏమి సమాధానం చెబుతారు? ఈ రాష్ట్రానికి ఏమి చెబుతారు? తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేక హోదా హామీ ఇచ్చిన మోదీ, వెంకన్నకే పంగనామాలు పెట్టాడు. నిజమైన భక్తులు ఇలా చేస్తారా? పదేళ్లపాటు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తాం.

- వైఎస్ షర్మిల, పీసీసీ చీఫ్



జగన్ ఢిల్లీలో ఎందుకు పోరాడరు?

కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే అక్కడి నాయకులు ఢిల్లీకి వచ్చి పోరాడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి అలా ఎందుకు పోరాటం చేయడంలేదు? కేవలం లోపాయికార ఒప్పందాలే ఇందుకు కారణం. ఈ విషయం ప్రజలందరూ గమనించాలి. దేశంలో బీజేపీపై పోరాటం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మాత్రమే.

- సచిన్ పైలెట్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి

దేవుడికే మోదీ పంగనామాలు



ప్రత్యేక హోదా కోసమే ఇండియా కూటమిలో చేరాం.హోదా కోసం ఏ పోరాటానికైనా కలిసి వస్తాం. దేశ ప్రజలకు భక్తితత్పరుడిగా కనిపించే మోదీ తిరుపతి దేవుడి సన్నిధిలో ఇచ్చిన మాటను తప్పి ఆ మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారు.బీజేపీ మతాన్ని ఆయుధంగా చేసుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ విచ్ఛిన్నానికి పాటుపడుతోంది. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారికే రాయితీలను ఇస్తూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోంది. మత సామరస్యం కోసం ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం.

- గఫూర్, సీపీఎం నేత

వైఎస్ బొమ్మనే కనుమరుగు చేసిన జగన్



కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా గతంలో ఒక హత్య కేసు నుంచి బయటపడడానికి 12మందిని చంపాడు. వైఎస్ రాజశేఖర రెడ్డి బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఆయన ఫొటోనే కనుమరుగు చేశాడు. అధికారం కోసం వాడుకుని వదిలేయడం వైసీపీ, టీడీపీలకు పరిపాటిగా మారిపోయింది.కాబట్టే ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరిబయట పడేయండి.

- నారాయణ,సీపీఐ జాతీయ కార్యదర్శి

దేశ రాజకీయాల్లో గొప్ప మలుపు



తిరుపతి సభలో మూడు జెండాల కలయిక దేశ,రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపు.కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు దూరం కావడంతోనే బీజేపీ పదేళ్లగా కేంద్రంలో అధికారంలో వుంది.ఇలాంటి తప్పిదాలకు ఇక తావు ఇవ్వకూడదు. రాష్ట్రానికి ఏడుగురు ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ నేడు కరువు కాటకాలతో అల్లాడిపోతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 130 స్థానాల్లో విజయం సాధిస్తుంది. షర్మిలే కాబోయే సీఎం.

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ముక్కంటీశుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు అందజేస్తున్న గురుప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 1: మదనపల్లెలోని జ్ఞాన ప్రసూనాంబిక డిగ్రీ కళాశాల నిర్వాహకులు రాటకొండ గురుప్రసాద్ శ్రీకాళహస్తి ఆలయానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్న ఆయన అమ్మవారికి 9 పట్టుచీరలు, స్వామివారికి 9 పట్టు పంచెలు సమర్పించారు. వరుసగా 23వ సంవత్సరం పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో మహద్భాగ్యంగా భావిస్తున్నామని ఆయన అన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి షన్మోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అమరావతి నుంచి కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎపిక్ కార్డుల జనరేషన్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఈనెల 4 నుంచి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, ఫిర్యాదుల పరిశీలన, 6,7,8 ఫారం పెండింగ్ పరిష్కారం చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని ఎన్నికల అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎస్పీ జాషువా, ఏఎస్పీలు, డీఎస్పీలు, డీఆర్వో పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలు - సమావేశాలు

జగనన్న వసతి దీవెన కింద రూ.20.54 కోట్లు జమ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: జగనన్న వసతి దీవెన కింద జిల్లాలోని 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.54 కోట్ల నగదు జమ చేశారు. నగదు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో సీఎం వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. జిల్లాలో 2023 అక్టోబరు, నవంబరు, డిసెంబరు త్రైమాసానికి సంబంధించి జిల్లాలోని 32,427 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చుతూ 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.54 కోట్లను జమ చేశారు. ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్, మేయర్ అముద, డీఆర్వో పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్‌కు 648 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: టెట్ పరీక్షల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం జిల్లాలోని మూడు సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలకు 648 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 841 మంది అభ్యర్థులకుగాను 648 మంది హాజరవగా, 193 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో 421 మందికిగాను 303 మంది హాజరవగా, 118 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 420 మందికిగాను 345 మంది హాజరవగా, 75 మంది గైర్హాజరైనట్లు డీఈవో వివరించారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల,మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు.అన్నమయ్య భవనంలో ఉదయం 9నుంచి 10గంటలవరకు నిర్వహించనున్న కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 0877-2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 86888 88802/03, 93999 76999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తు గడువు, ప్రవేశపరీక్షల తేదీలు ఇలా..

క్రమసంఖ్య	ప్రవేశపరీక్ష	దరఖాస్తు గడువు	పరీక్ష నిర్వహించే తేదీ
1	ఏపీఆర్‌జేసీ	31-03-2024	25-04-2024
2	ఏపీపాలిసెట్	05-04-2024	27-04-2024

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించండి

ఈసీకి టీడీపీ నేతల లేఖ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 1: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్ (ఈసీ)కి లేఖ రాసినట్లు టీడీపీ నేతలు తెలిపారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని వైసీపీ నేతల వద్ద ఉన్న లైసెన్స్ ఆయుధాలు, అక్రమ ఆయుధాల్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రతి ఎన్నికల్లోనూ ఈ ఆయుధాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయుధాలను తక్షణం పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి హేమాద్రి నాయుడు, నేతలు సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తొత్తుల్లా ముగ్గురు సీఐలు

శ్రీకాళహస్తి టీడీపీ నాయకులపై అక్రమ రౌడీషీట్లు తెరుస్తున్నారు ● ఎస్పీకి పార్టీ నేతల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం)/శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముగ్గురు సీఐలు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎస్పీ మలిక గర్గ్‌ను కోరారు.శుక్రవారం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన టీడీపీ నాయకులు ఎస్పీని కలిశారు. పోలీసుల తీరు, అక్రమ కేసులు, రౌడీషీట్లు, వేధింపుల గురించి ఆమెకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి పార్టీ సమన్వయకర్త బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్, తొట్టంబేడు సీఐ శ్రీహరి, ఏర్పేడు సీఐ మల్లిఖార్జున్ వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదుచేయడమే కాకుండా రకరకాలుగా వేధిస్తున్నారన్నారు. ఏర్పేడు మండలంలో ఒకే కుంటుంబానికి చెందిన పి. ధనుంజయులు నాయుడు (67), చిరంజీవులు నాయుడు (69), పి. నాగరాజనాయుడు (52)తో పాటు పి. శివశంకర్‌రెడ్డి (69), మల్లిఖార్జున నాయుడు (62), బాబునాయుడు (58), కామాక్షి (46)పై రౌడీషీట్లు తెరిచారన్నారు.అయితే ఆ విషయం వారెవరికీ పోలీసులు ముందస్తుగా తెలియజేయలేదని చెప్పారు. మరో 42 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తనకు సమాచారముందని వెల్లడించారు.మండల, క్లస్టర్ స్థాయిలో ప్రధానమైన నాయకులను విచారణ పేరుతో స్టేషన్లకు పిలుస్తున్నారన్నారు.అధికారులు బయటకు వెళ్లిపోతూ ఎటువంటి విచారణ లేకుండా స్టేషన్‌లోనే కూర్చోబెడుతున్నారని చెప్పారు. రోజు రాత్రి ఎప్పుడో సీఐ వచ్చేవరకు నాయకులు స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల వేళ పార్టీ ప్రధాన నాయకులు ప్రచార కార్యకలాపాల్లో పాల్గొనకుండా చేసేందుకే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటి గురించి ఎస్పీకి వివరించామని, ఎస్పీ సానుకూలంగా స్పందించడంతో పాటు దర్యాప్తుచేసి కేసులు, రౌడీషీట్లు అక్రమమని తేలితే తీసేస్తామని హామీ ఇచ్చారని సుధీర్‌రెడ్డి చెప్పారు.రాష్ట్రంలోని టీడీపీ నాయకులందరూ కూడా తమపై రహస్యంగా కేసులు నమోదుచేసి రౌడీషీట్లు ఏమైనా తెరిచారా అని చెక్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జిలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి నరసింహయాదవ్, కోశాధికారి కంత రమేష్,తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష,మీడియా ఇన్‌చార్జి శ్రీధర్‌వర్మ,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

పోలీసులు వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత శుక్రవారం ఎస్పీకి వినతి పత్రం అందజేశారు.క్రియాశీలకంగా ఉన్న పార్టీ కార్యకర్తలను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి రౌడీషీటర్, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి ఆదేశాలతో తన భర్త చంద్రబాబుపై 15 కేసులు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జనసైనికులు గణేష్, చంద్రశేఖర్, శివకుమార్, బాలాజీ, రవి, చిరంజీవి పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..సేవ చేస్తా : గురజాల



జీజేఎంను కలిసిన గుడిపాల టీడీపీ నాయకులు

గుడిపాల, మార్చి 1: ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి ప్రజలకు నిస్వార్థంగా సేవచేస్తానని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తివంచన లేకుండా తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, టీడీపీ నాయకులు తుమ్మల సాంబశివనాయుడు, రామ్మూర్తినాయుడు, ఆనంద్ యాదవ్, గోపి, రవినాయుడు, సుధాకర్‌యాదవ్, చందు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి బూత్ కన్వీనర్లే కీలకం



మాట్లాడుతున్న రవిప్రకాష్

శ్రీరంగరాజపురం, మార్చి 1: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి బూత్ కన్వీనర్లే కీలకమని గంగాధర నెల్లూరు నియోజక వర్గం పరిశీలకులు రవిప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల బూత్ కన్వీనర్లతో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవిప్రకాష్ మాట్లా డుతూ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడి థామస్‌ను గెలిపించాలని కోరారు. దాము, బాలాజీ నాయుడు, రాజశేఖర్ నాయుడు, సిద్దయ్యశెట్టి, కుమార్, పుల్లూరు బాబు, మహబూబ్ బాషా, సోమశేఖర్, దేవరాజులు నాయుడు, రామిరెడ్డి, నోమేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

బంగారుపాళ్యం, మార్చి 1: వ్యవసాయ రంగం లో నూతన పద్ధతులను అవలం బిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఆత్మ డీపీడీ రత్న ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మోజిపల్లె రైతు భరోసా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉన్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీక్రిష్ణ, ఏడీఏ లక్ష్మీదేవి, ఏవో చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీఎంసీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి : బీజేపీ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బర్తరఫ్ చేయాలని శుక్రవారం గాంధీ విగ్రహం ముందు బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు మాట్లాడుతూ టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్ భూదందాలు చేస్తూ, భూములు అప్పగించని వారిని దారుణంగా హత్య చేయడం, బాధితుల భార్యలను హత్యాచారం చేయడం వంటి అకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అక్కడి బీజేపీ పలు మార్లు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. షేక్ షాజహాన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ధర్నాలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నగరి, మార్చి1: గుండ్రాజుకుప్పంలోని సీతారాముల ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కుంభాభిషేకాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. తొలిరోజు నవగ్రహ హోమంతో ప్రారంభమై మూడవ రోజు ఆలయ కుంభాభిషేకం, పంచలోహ విగ్రహాలతో కూడిన ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చన, అభిషేకం అనంతరం సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ



చిత్తూరు కల్చరల్, మార్చి 1: స్థానిక బజారు వీధి శివ షణ్ముగ సుందర వినాయక ఆలయ కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవ పూజలు మూడు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. చివరిరోజైన శుక్రవారం స్వామి మివారికి అంగరంగ వైభవంగా పుష్పపల్లకి సేవ నిర్వహించారు. కేరళ సాంస్కృతిక కళాకారులు డప్పులు, విచిత్ర వేషధారణలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ కణ్ణన్, గౌరవాధ్యక్షులు మణి, సభ్యులు అంబిగా, సుజన శ్రీధర్, విజయరాఘవులు, రా.జేందర్, కళావతి, రాము, వరలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పాలసముద్రం, మార్చి 1: సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనదుర్గాపురం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైసీపీకి కాలం చెల్లింది : బీజేపీ

విజయపురం, మార్చి 1: కేంద్ర ప్రభుత్వ పథకాలను తమవిగా చెప్పుకుంటున్న వైసీపీ పాలనకు కాలం చెల్లిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పన్నూరు, కళియంబాకం, నారపరాజుకండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురం పంచాయతీలో ప్రజాపోరు యాత్ర చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, నాయకులు పురుషోత్తంరెడ్డి, యుగంధర్‌రాజు, జలజాక్షి, రామ్మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన ఎంఈవో

నింద్ర, మార్చి 1: మండలంలోని చవరంబాకం జిల్లా ఉన్నత పాఠశాలను శుక్ర వారం ఎంఈవో శ్రీధర్‌రాజు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వివరాలు, పాఠ్యాం శాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పాఠ్యాంశాల బోధనపై ఆరా తీశారు. పరీక్షలు చక్కగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

గంగుపల్లిలో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, మార్చి 1: మండలంలోని గంగుపల్లి సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 306 మందికి వైద్యం అందించారు. 23 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్లు సీతారామరాజు, హర్షవర్ధన్, రాజశేఖర్, హెల్త్ ప్రొవైడర్‌లు కీర్తి, రూప, చరిత, డీడీవోలు సురేంద్ర, కుమార్‌చౌదరి, అంగన్వాడీ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి ఇతర వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్ సభను విజయవంతం చేయండి

యాదమరి, మార్చి 1: ఈ నెల 10వ తేదీన జోడిచింతల వద్ద జరిగే నారా లోకేశ్ సభను విజయవంతం చేయాలని టీడీపీ పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్ కోరారు. శుక్రవారం జంగాలపల్లె గ్రామస్తులతో నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత జంగాలపల్లెను దత్తత తీసుకుంటానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రవి, సీనియర్ నాయకులు అమరనాథనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు రూరల్, మార్చి 1: నగరంలోని వరిగిపల్లిలో అపోలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టరు జాకీర్, తిరుపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిగిపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో బాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించారు. అనంతరం వారి క్యాంపుకు తరలించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారన్నారు. సుమారు 50 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని అభినందించారు.

4న కాణిపాకంలో పలు ప్రారంభోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

ఐరాల(కాణిపాకం) మార్చి 1: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద రూ.9 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 4వ తేదీన ప్రారంభోత్సవం చేయనున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు కలెక్టర్‌తో సహా పలువురు జిల్లాస్థాయి అధికారులు విచ్చేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాణి, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెస్కోలో అర్హత లేనివారికి ఉద్యోగాలు ఇస్తున్నారు

చిత్తూరు రూరల్, మార్చి 1: కుప్పం రెస్కోలో అర్హులను కాదని అనర్హులకు ఉద్యోగాల ఇస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నేతలకు చెందిన వ్యక్తులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని విమర్శించారు. సీనియర్లను పక్కనబెట్టి అర్హతలేని జూనియర్ అధికారులను అందలం ఎక్కిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వెదురుకుప్పం, మార్చి 1: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని 24 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.15,20,000 చెక్కులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి అందజేశారు. శుక్రవారం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు స్వీకరిస్తున్న వెదురుకుప్పం, కాణిపాకం ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రామ్మోహన్

విజయపురం/ కార్వేటినగరం/ ఐరాల(కాణిపాకం)/ పెనుమూరు/ నింద్ర/ చిత్తూరు/వెదురుకుప్పం/ గుడిపాల, మార్చి 1: విజయపురం ఎస్ఐగా జయప్ప, కార్వేటినగరం ఎస్ఐగా వెంకటకృష్ణ, నింద్ర ఎస్ఐగా రామచంద్ర, ఐరాల ఎస్ఐగా రమేష్, కాణిపాకం ఎస్ఐగా రామ్మోహన్, పెనుమూరు ఎస్ఐగా లోకేశ్, యాదమరి ఎస్ఐగా రామాంజినేయులు, చిత్తూరు టూటౌన్ ఎస్ఐగా ప్రసాద్, వెదురుకుప్పం ఎస్ఐగా వెంకటేశ్వర్లు, గుడిపాల ఎస్ఐగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. ఆయా స్టేషన్ల సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్



ఓటు అభ్యర్థిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, మార్చి1: నగరి నియోజకవర్గ పరిధిలోని మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి 17వ వార్డులోని వినాయక పురంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో 8సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీలు పెంచకుండా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు, కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు జగన్నాథం మొదలియార్, ఎస్.పి.లోకమూర్తి, కేఎస్ నటరాజన్, మణివన్నన్, వేలన్. మురుగేషన్, విజయన్, కరుణ. రుక్కుం బాలాజీ, ఇలంగోవన్, కృష్ణ, పొన్నయ్య జనసైనికులు మహేష్, శివ, దేవ పాల్గొన్నారు.

జగన్ అరాచకాలను జనానికి తెలియజేయండి

సీఎం జగన్ అరాచక పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని గాలి భానుప్రకాష్ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. పట్టణ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సూపర్ సిక్స్‌తో ప్రజలకు జరిగే మంచిని వివరించాలని తెలియజేశారు. భవిష్యత్తు తరాల కోసం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెం టరీ అధికార ప్రతినిధి చినబాబు, నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, పుత్తూరు పట్టణ అధ్య క్షుడు జీవరత్నంనాయుడు నగరి మండల అధ్య క్షుడు శివకుమార్‌రెడ్డి, నింద్ర అధ్యక్షుడు వెంకటేశులునాయుడు, విజయపురం అధ్యక్షుడు రమేష్‌రాజు, వడమాలపేట అధ్యక్షడు వెంకటయ్య, దశరధవాసు, జనసేన నియోజకవర్గ నాయకులు మహేష్, టీఎన్‌టీయూసీ బాలాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహితులే హంతకులు

- హత్యకేసులో నిందితుల అరెస్టు
- డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వెల్లడి



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

గంగాధరనెల్లూరు, మార్చి 1: స్నేహితులే హంతకులయ్యారు. బెంగళూరుకు చెందిన మురుగన్ (47) ఈ నెల 27న చెర్లోపల్లె దళితవాడకు సమీపంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు సిటీ ఆర్ఎస్ పాల్యలో చిక్కన్న లే అవుట్‌కు చెందిన మురుగన్ (47), తిరుపతి జిల్లా సత్యవేడు మండలం అంబాక్కంకు చెందిన నాగరాజ (40), బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె పంచాయతీ బొమ్మాయిపల్లెకు చెందిన బాలాజీ(37) స్నేహితులు. నాగరాజు వద్ద మురుగన్ రూ.40వేలు అప్పు చేశాడు. ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని నాగరాజు భార్య మురుగన్‌ను కోరింది. ఆ సమయంలో మురుగన్ ఆమెను అసభ్యంగా దూషించాడు. దీంతో మురుగన్‌పై నాగరాజు కక్ష పెంచుకున్నాడు. అతన్ని అంతం చేయాలని బాలాజీ సాయం కోరాడు. ఈ క్రమంలో బాలాజీకి పెళ్లి సంబంధాలు చూసే నెపంతో గతనెల 26వ తేదీన బెంగళూరు నుంచి కారులో వచ్చారు. గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లె దళితవాడకు సమీపంలోని ఓ పొలంలో ముగ్గురూ మద్యం సేవించారు. ఈ క్రమంలో మురుగన్ మద్యం మత్తులో ఉన్నాడని నిర్ధారించుకున్న తర్వాత నాగరాజు, బాలాజీ వారివెంట తెచ్చుకున్న సుత్తితో అతడి తలపై మోది చంపేసి వెళ్లిపోయారు. 27వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడని గంగాధరనెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐలు శంకర్, కుళ్లాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వర్, వెంకటసుబ్బమ్మ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు నగర సరిహద్దు చెన్నై - బెంగళూరు ప్రధాన రహదారిలోని బాలత్రిపుర సుందరి కల్యాణ మండపం వద్ద అనుమానాస్పదంగా ఉన్న నిందితులను అరెస్టు చేశారు.

మీరైనా, మీ కూతురైనా ఓటమి ఖాయం: థామస్



సమావేశంలో మాట్లాడుతున్న థామస్

శ్రీరంగరాజపురం, మార్చి 1: 'రాబోయే ఎన్నికల్లో మీరైనా, మీ కుమార్తె అయినా ఓడించడం మాత్రం ఖాయం' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామికి టీడీపీ గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సవాల్ విసిరారు. శుక్రవారం క్షీరసముద్రంలో లోకేష్ పాల్గొనే సభాస్థలిని ఆయన టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీరు ఎక్సైజ్ మినిస్టర్‌గా నకిలీ మద్యంలో వాటాలు తీసుకోలేదా.. ఇసుక దందాలతో కమిషన్లు రాలేదా అని నిలదీశారు. అవినీతి మొత్తం నీ కుమార్తెతోనో, బంధువులతోనో చేయించి అవినీతి చేయలేదంటే జనం నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. వచ్చేది టీడీపీ-జనసే ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, దొడ్డ హేమాద్రి యాదవ్, గంధమనేని కుమార్, మాధవ నాయుడు, బ్రహ్మనాయుడు, మణి, బాలాజీ నాయుడు, భాస్కర్ నాయుడు, జనార్ధన్, కుప్పయ్య పాల్గొన్నారు.

వేపంజేరి ఆలయ ట్రస్టీకి కన్నీటివీడ్కోలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

గంగాధరనెల్లూరు, మార్చి 1: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయ ట్రస్టీ, తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది కె.ఎస్.శ్రీధర్(81)కి శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. తిరుపతి కరకంబాడి రోడ్‌లో గల అట్లాంటిక్ స్కూలుకు శుక్రవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని సందర్శకుల కోసం ఉంచారు. అక్కడ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి మేయర్ శిరీషా, ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, వేపంజేరి ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శుభరాము, పలువురు న్యాయవాదులు పలు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గోవిందధామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

థామస్‌ను గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పాలసముద్రం, మార్చి 1: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని ఎస్ఆర్ఆర్ కండిగ పంచాయతీలోని గ్రామాల్లో శుక్రవారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి వాసునాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు విజయ్ కుమార్, హేమాద్రి, నవీన్ చౌదరి, చెంగమ నాయుడు, ఏయుమలై, శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి



చేకూరివారిపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మురళీమోహన్

తవణంపల్లె, మార్చి 1: టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్ కోరారు. శుక్రవారం మండలంలలోని చేకూరి వారిల్లె, వడ్డిపల్లె, కుమ్మరపల్లె, గాజులపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటా 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, కోదం డయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్, నాయకులు మధు, గోపి, గిరి, ప్రవీణ్, సుధాకర్‌నాయుడు, శరవణ, చిట్టెమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

చిత్తూరు, మార్చి1: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ మాఫీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగరపాలక కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు మొత్తాన్ని ఒకేసారి చెల్లించినవారికి వడ్డీ మాఫీ ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొందని తెలియ జేశారు. బకాయిలు మొత్తాన్ని ఈ నెల 31వ తేదీలోపు చెల్లించినవారికి వడ్డీ మినహాయింపు ఉంటుందని వివరించారు. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించినవారికి మాఫీ మొత్తాన్ని భవిష్యత్‌లో చెల్లించే పన్నుల్లో సర్దుబాటు చేస్తామని పేర్కొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

పాలసముద్రం: బీఎల్వోలు ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఆర్వో వెంకటశివ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పుల్లేకుండా చూడాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గుడిపాలలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

నగరి/ కార్వేటినగరం/ పాలసముద్రం/ గుడపాల, మార్చి1: నగరి పట్టణ పరిధిలో మూడు పరీక్షా కుంద్రాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాం తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో విద్యార్థుల తలిదండ్రులు సైతం విచ్చేశారు. కార్వేటినగరం ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన పరీక్షలకు 42 మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ స్వరూప వివరాలను తెలిపారు. పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ వినాయకం, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ జ్ఞానశేఖర్ పేర్కొన్నారు. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వెస్ట్‌సీఐ రవిశంకర్, ఎస్ఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు. కాగా మండలంలో 232 మంది పరీక్షలు రాయాల్సివుండగా 16 మంది గైర్హాజరయ్యారు.

శేషాద్రికి డాక్టరేట్



బంగారుపాళ్యం, మార్చి 1: గ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శేషాద్రి తమ సంస్థ ద్వారా 20 సంవత్సరాలుగా నిరుపేదలకు ఆర్థిక చేయూత నందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించి ఢిల్లీలోని హెసెన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ జర్మనీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులు ప్రదీప్ కత్రి, ఢిల్లీ డీఎస్పీ, ప్రొఫెసర్ జోత్స్న, పరియన్ సోరియన్ డైరెక్టర్ ఫ్రమ్ జర్మనీ యూనివర్శిటీ, ఆర్గనైజర్ అభిషేక్ జీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు చాలా విలువైంది

చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, యువత ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు నాడు విద్యార్థి సమైక్య చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ పేర్కొన్నారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ట్స్, వీసీఆర్ డిగ్రీ కళాశాలల్లో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గిరి, గౌస్, యశ్వంత్, ప్రియాంక, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 21 మంది ఎంపిక



చిత్తూరు (సెంట్రల్), మార్చి 1: స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. బెంగళూరువారి అమేజాన్ వేర్ హౌస్ కంపెనీలో రూ.2.08 లక్షల వార్షిక వేతనానికి ఎంపికైన విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి పనుల తనిఖీ



యాదమరి, మార్చి 1: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రాజశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని 14 కండ్రిగ పంచాయతీలో తవ్విన ఫారంపాండ్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పశుగ్రాసం, పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

ప్రతి ఇంటికీ ఫ్రీ కరెంటు



వెదురుకుప్పం, మార్చి 1: ప్రతీ ఇంటికీ ఉచిత సోలార్ ప్లేట్స్ ప్రతి ఇంటికీ ఫ్రీ కరెంటు ఇవ్వడమే ప్రధాని మోదీ లక్ష్యమని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ అన్నారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లెలో కేంద్రప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం కల్పించారు.

స్వామివారికి దండేల సమర్పణ

చిత్తూరు కల్చరల్, మార్చి 1: నగరంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన కోదండరామాలయానికి భక్తులు వాహన సేవల దండేలను (కొయ్యలు) శుక్రవారం బహూకరించారు. అర్చకులు వేణుగోపాల్ వాటికి పూజలు చేశారు. రానున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలకు ఉపయోగించనున్నట్లు ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రవి. శ్రీనివాస్ పాల్గొన్నారు.